క్లుప్తంగా

టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీ

బిక్కవోలు: కొంకుదురు పీహెచ్‌సీ పరిధిలో కొంకుదురు-1లో వైఎస్సార్ క్లినిక్, పీహెచ్‌సీలను వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. సోమవారం డీపీఎంఓ డాక్టర్ అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా గణాంక అధికారి కుమార స్వామి, డీపీహెచ్ఎన్ఓ వసంతలక్ష్మీ, డీపీవో సంధ్యారెడ్డి, డైటా మేనేజర్ రామకృష్ణతో కూడిన బృందం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలోని పీహెచ్‌సీ వైద్యరాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

సీతానగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టడానికి, ముఖ్యమంత్రిగా జగన్‌ను మరోసారి ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆయన సోమవారం సీతానగరంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రానున్న రోజుల్లో మరింత ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించి, అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, బూత్ కమిటీల అధ్యక్షుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పట్టపగల విష్ణుప్రసాద్, జక్కంపూడి జగపతి, సత్తి పండురాజు, కొంచ భాస్కరరావు, ముదునూరి రామకృష్ణ రాజు, గద్దె వీరన్నబాబు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యా భారతి స్టడీమెటీరియల్‌ను ఉపసర్పంచి డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. సోమవారం పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ విద్యార్థి కీలక దశ పదో తరగతి అన్నారు. అందుకే నిర్లక్ష్యం చేయకుండా పదోతరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉత్తీర్ణతకు కోసం ప్రభుత్వం విద్యా భారతి అనే స్టడీ మెటీరియల్ అందిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, పాఠశాల హెచ్ఎం పి.వీర ప్రభాకర్, ఉపాధ్యాయులు జె.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

రంగంపేట: స్థానిక శ్రీభారతి యుపీ స్కూల్‌లో లయన్స్ క్లబ్ వారి బహూకరించిన సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలంఓ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ దంపతులు పాల్గొని సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు కళ్లజోళ్లు ఉచితంగా అందించారు. దీంతో విగ్రహదాలను, కళ్లజోళ్లు బహూకరించిన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ గ్రంధి వసంతకుమారీ, లయన్ దత్తు, లయన్ బాబు, లయన్ మాధవరావు, లయన్ రాఘవులు, లయన్ మాలతి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి హైస్కూల్లో 8 వతరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ఉషారాణి, విద్యాకమిటీ చైర్మన్ జీవరత్నం, స్థానిక నాయకులు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో అక్షయాన్నామృతం (అన్నసమారాధన) కార్యక్రమం సోమవారం కొనసాగింది. జక్కంపూడి రామ్మోనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అయిల రామకృష్ణ, తాతపూడి చక్రవర్తి పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు.

సీతానగరం: వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయం వద్ద జక్కంపూడి అక్షయామృత నిత్యాన్నదాన సేవా పథకం కొనసాగిస్తామని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తెలిపారు. పార్టీ నాయకులు డాక్టర్ బాబు, జక్కంపూడి జగపతి, ఘంటా శ్రీనివాస్ తదితరులతో కలిసి సోమవారం ఆ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 16 నుంచి సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ వద్ద బహిరంగ ప్రదేశంలో నిర్వహించామని, ఇకపై పార్టీ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు.

నేడు వైద్యశిబిరం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని సచివాలయం-1 వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు కొంకుదురు సీహెచ్‌సీ వైద్యరాలు విజయలక్ష్మి తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.


రాజానగరంలో శ్రీరామ పల్లకీ ఉత్సవం


సీతానగరంలో ఆర్యవైశ్యుల బైక్ ర్యాలీ


పందలపాకలో కలశాలతో గ్రామోత్సవం చేస్తున్న మహిళలు


సీతారాముల చిత్రపటం, కలశలను చేతపట్టి అనపర్తిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అంతా రామమయం

రాజానగరం: అయోధ్యలో బాలరాముడిని విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకుని రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో సోమవారం రామనామం మార్మోగింది. సీతారాములు, ఆంజనేయస్వామి, ఇతర దేవతామూర్తుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజానగరం రావుల చెరువు గట్టున ఉన్న కోదండ రాముని ఆలయంలో భక్త మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. సాయంత్రం దీపోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అగ్రహారంలోని రామాలయం నుంచి పురవీధుల గుండా శ్రీరామ పల్లకీ ఉత్సవం జరిపారు.

- దివాన్‌చెరువులోని రామాలయంలో భక్తుల ఆధ్వర్యంలో లక్ష తులసి పత్రి పూజ జరిగింది. ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీరామపురం రోడ్డులోని రామాలయంలో రామకోటి రాసిన 300 మంది భక్తులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. దివాన్‌చెరువులోని మహా గణపతి యువజన సేవా సమితి, సేవా ఉగాది సంయుక్తంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశాయి.

దేశానికి మంచి భవిష్యత్తు

మధురపూడి: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో దేశానికి మంచి భవిష్యత్తు ఏర్పడనుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏపీఆర్ చౌదరి అన్నారు. కోరుకొండ మండలం గాడాలలో శ్రీరామ ఉత్సవాలు నిర్వహించారు. అలాగే కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు, మహిళలు ప్రదర్శనలు నిర్వహించారు.

శ్రీరామనామ జపం

సీతానగరం: మండలంలోని ప్రతి గ్రామంలోనూ శ్రీరామనామం మార్మోగింది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో శోభాయాత్రలు జరిపారు. ఆలయాల వద్ద ఏకాహం భజన నిర్వహించారు. ఇనుగంటివారిపేటలో సర్పంచ్ సత్యం రాంపండు 1300 జాకెట్ ముక్కలు, పులిహోర ప్యాకెట్లను ప్రతి ఇంటికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. తొలుత రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎన్నో వివాదాలు, న్యాయపోరాటాల తర్వాత శతాబ్దాల కల నేటితో సాకారం అయిందన్నారు. అనంతరం సీతానగరం కంకటాల వారి రామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత పోలీస్ స్టేషన్ వద్ద నూతనంగా నిర్మించే రామాలయం అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ - 2 సత్యం మదన్‌బాబు, కుంచు అచ్యుత రామారావు, కొండాటి ప్రసాద్, గాడి రవికుమార్, పెందుర్తి వెంకటకృష్ణ, కుప్పల చక్రపాణి పాల్గొన్నారు.


ఇనుగంటివారిపేటలో వస్త్రాలు, పులిహోర పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- సీతానగరంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పువ్వాడ కృష్ణ ఆధ్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో 400 బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. చినకొండేపూడి, రఘుదేవపురం, రాపాక, సీతానగరాల్లో బైక్ ర్యాలీతో శోభాయాత్ర జరిగింది. బొబ్బిల్లంక ప్రభాకర్ నగర్ శ్రీలక్ష్మి గణపతి ఆలయం నుంచి సుబ్బారావు పేట వరకు శోభాయాత్ర నిర్వహించారు. రాపాకలో తెల్లవారుజామున నగర సంకీర్తన, ఏకాహం భజన కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు దోనేపల్లి సీతారాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆధ్యాత్మిక సందడి

పెదపూడి: అయోధ్య నగరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగిన నేపథ్యంలో మండలంలోని గ్రామాలు జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. దేశ ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా అభిజిత్ లగ్నంలో జరిగిన మహోన్నత ఘట్టాన్ని భక్తులు టెలివిజన్, ఇతర సౌకర్యాలతో వీక్షించి పులకించిపోయారు. సోమవారం తెల్లవారుజామునుంచే గ్రామాల్లోని హిందూ ఆలయాల వద్ద భక్తుల సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని ప్రసిద్ధి చెందిన కోదండ రామాలయం భక్తులు రద్దీ నెలకొంది. మధ్యాహ్నం 12.29 నిముషాల వరకు భక్తులు పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారు. శ్రీరామ సంకీర్తనలు ఆలపించారు. పలు ఆలయాల్లో పండితులు ఈ విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేకతను భక్తులకు వివరించారు. గ్రామాల్లో అన్నసంతర్పణలు చేశారు. ఇది దేశ చరిత్రలో ఒక అద్భుతఘట్టంగా పండితులు వివరించారు.

వైభవంగా శోభాయాత్ర

అనపర్తి: జై శ్రీరామ్ అంటూ భక్తుల రామనామ స్మరణతో అనపర్తి మార్మోగింది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపనతో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దీనిని పురస్కరించుకుని రామభక్తుడు లంకలపల్లి త్రిమూర్తులు, మదర్ థెరిసా సేవా సంస్థ యూత సభ్యులు ఆధ్వర్యంలో భారీగా తరలి వచ్చిన భక్తుల శ్రీరామ నామ సంకీర్తనలతో, దీప జ్యోతులతో గ్రామ పురవీధుల్లో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ పురోహితులు నాగదేవర బాలాజీశర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి శ్రీజ్యోతి, తేతలి వెంకటరెడ్డి కాంచన, ద్వారంపూడి సురేష్‌కృష్ణారెడ్డి దంపతులు శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాముల వారి చిత్రపటం, కలశం, రామపాదుకలు చేతపట్టి కాషాయి రంగు జెండాలతో, చిన్నారులు సీతారామ లక్ష్మణులు, హనుమంతుని వేషధారణలతో, మహిళలు పళ్లాల్లో జ్యోతులు వెలగించి వాటిని చేతబట్టి శ్రీరామ నామ సంకీర్తనలు చేస్తూ గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర చేశారు.

గ్రామోత్సవం

రంగంపేట: మండలంలో రామాలయాల కమిటీల ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి ఇంటా సీతారాముల చిత్ర పటాలకు ప్రత్యేక పూజలు చేశారు. సింగంపల్లి గ్రామంలో భజనలు, జైత్రయాత్ర నిర్వహించారు.

బిక్కవోలు: అయోధ్యలో బాల రాముడు విగ్రహ ప్రాణ పతిష్ఠ సందర్భంగా మండలంలో ఉత్సవాలు నిర్వహించారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఏకాహం భజనలు, బైకు ర్యాలీతో తమ సీతారాములు గురించి ప్రచారంతో హిందూ సంప్రదాయలకు ప్రజలుకు మరింత అవగాహన కల్పించారు. దీనిలో బిక్కవోలు, కొమరిపాలెం, బలభద్రపురం, కొంకుదురు, పందలపాక, మోళ్లూరు, ఊలపల్లిలో తదితర గ్రామాల్లో గ్రామోత్సవాలు, కలశాల గ్రామోత్సవాలు, దీపాలంకరణలో సందడి చేశారు. అనంతరం అన్నసమారదనలు, ప్రసాదాలను భక్తులు అందించారు.

జైశ్రీరాం ఆకృతిలో విద్యార్థులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులనే జైశ్రీరాం ఆకృతిలో కనువిందు చేశారు. సోమవారం పాఠశాల పీడీ దార్వంపూడి యువరాజా రెడ్డి సారథ్యంలో చేసిన విన్యాసాలు అందరినీ ఆకర్షించాయి. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


సింగంపల్లిలో సీతారాముల జైత్రయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు


జి.మామిడాడలో ర్యాలీ చేస్తున్న భక్తులు


దివాన్‌చెరువులో లక్ష తులసి పూజ చేస్తున్న మహిళలు

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం

రంగంపేట: రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో తమ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థసారధి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ కృష్ణసాయి నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో 9వ తరగతి విద్యార్థిని టీబీఎస్ ప్రసన్న తయారు చేసిన బయోమెట్రిక్ ఓటింగ్ యంత్రం అనే అంశానికి ఉత్తమ బహుమతి, మూడు వేల నగదు, సైన్స్ కిట్టు, సైన్స్ పుస్తకాలు, ధ్రువీకరణపత్రం అందుకున్నట్టు తెలిపారు. విద్యార్థిని ప్రసన్నను, గైడ్ టీచర్ రమ్యసుధను పలువురు అభినందించారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు

రాజానగరం: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. వీటిని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారన్నారు. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో నిర్వహించిన ఐదు క్రీడా పోటీలలో ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటారన్నారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలకు బహుమతులతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. 24న కబడ్డీ, 27న వాలీబాల్, 29న క్రికెట్, 30న షటిల్, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు.

గ్రాహం స్టెయిన్ కుటుంబానికి నివాళి


గ్రాహం స్టెయిన్‌కు నివాళులర్పిస్తున్న సభ్యులు

మధురపూడి: క్రైస్తవ మిషనరీ అధినేత గ్రాహం స్టెయిన్ కుటుంబానికి సోమవారం దానియేలు ప్రేయర్ అండ్ గాస్పెల్ టీమ్ సభ్యులు దోసకా యలపల్లిలో నివాళులర్పించారు. 1999 జనవరి 22న హత్య చేయబడిన గ్రాహం స్టెయిన్, ఆయన ఇద్దరు కుటుంబ సభ్యుల చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంస్థ అధ్యక్షుడు ఉషాకుమార్, కార్యదర్శి రాజ్‌కుమార్, పరదేశి, కాసులు, అబ్రహం, రాజుబాబు, ఆనందరాజు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు

- క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత
- ఎంపీడీవో సాయిబాబు

పెదపూడి: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీడీవో వి.వి.సాయిబాబు తెలిపారు. జి.మామిడాడ డి.ఆర్.కె.రెడ్డి కాలేజీ ఆవరణంలో జరిగే ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా క్రికెట్ విభాగంలో సంపర, రామేశ్వరం జట్లు మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో రామేశ్వరం విన్నర్ గాను, సంపర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. ఇలాంటి గ్రామీణ క్రీడల ద్వారా క్రీడాకారులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరం గ్రామ సర్పంచ్ కొటికలపూడి చిన బాబు పీటీపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాస చౌదరి, అచ్చిరాజు, త్రినాద్, చిన్ని, ప్రసన్న, కృష్ణారెడ్డి, పిజికల్ డైరెక్టర్ల గిరి, గౌరిశంకర్, పాల్గొన్నారు.


రామేశ్వరం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సాయిబాబు

రాష్ట్రంలో సీఎం జగన్ ఆదర్శ పాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చక్రద్వారబంధంలో గడప గడపకూ..

రాజానగరం: రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు చేకూర్చుస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పాల్గొన్నారు. అవ్వా, తాత, అక్క, చెల్లి, అమ్మ, అన్న .. అంటూ ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఇంకనూ వారు ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం తమదేనన్నారు. సుస్థిర పాలన అందించే తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను కోరారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలను అందజేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు నాగవరపు త్రిమూర్తులు, వాడ్రేవు శ్రీనివాస్ కుమార్, మార్గాని శ్రీను, వేమగిరి కృష్ణ, నీలపాల శివరామకృష్ణ, దుర్గా రమేష్, పితాని కొండ, సోడసాని గణేష్, భూషంశెట్టి అన్నవరం, గుత్తుల చంద్రరావు, కురుమళ్ల బాబీ, యాళ్ల నిరీక్షణరావు, ఎస్ఎస్‌వీ సత్యనారాయణ, నాగవరపు వెంకటరమణ, పితాని రాంబాబు, కోలాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ నరసన్నకు పూజలు


కోరుకొండ నరసింహస్వామి సన్నిధిలో మంత్రి వేణు


స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామిని సోమవారం జిల్లా ఇన్‌చార్జి, బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరింత శక్తిని ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అర్చక స్వాములు పెద్దింటి చంటిబాబు, గిరి, నాగు, కృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్యనాయుడు, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజా పూజలు

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ నాయకులు, అర్చక స్వాములు సాదర స్వాగతం పలికారు. పూజాది కార్యక్రమాలనంతరం స్వామివారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు. రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న సంక్షేమ పాలనను ఆశీర్వదించాలని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజానగరంలో 2,13,911 మంది ఓటర్లు

రాజానగరం: భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలను అనుసరించి చేపట్టిన స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమం అనంతరం నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితాను నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి సోమవారం ప్రకటించారు. 216 పోలింగ్ కేంద్రాలు ఉన్న రాజానగరం నియోజకవర్గంలో 2,13,911 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,05,824 మంది, మహిళలు 1,08,083 మంది, నలుగురు థర్డ్ జెండర్ ఉన్నారు. గత ఏడాది జనవరి 5న ప్రకటించిన జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,06,435 మంది మంది ఓటర్లు కాగా, స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమం ద్వారా మరో 7,476 మంది పెరిగారు.

క్రికెట్ పోటీల విజేత గాడాల

మధురపూడి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రికెట్‌లో గాడాల జట్టు విన్నర్‌గా నిలిచింది. కోటి జట్టుపై ఫైనల్స్‌లో విజయం సాధించింది.


ఆర్ఆర్ఆర్ చిత్రంలోని ఓ సన్నివేశాన్ని ప్రదర్శిస్తూ విచిత్ర వేషధారణలతో మొక్కును తీర్చుకున్న యువకులు

సత్తెమ్మా.. చల్లగా చూడమ్మా..

- ముగిసిన అమ్మవారి జాతర
- విచిత్ర వేషధారణలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

అనపర్తి: కొప్పవరం గ్రామ దేవత సత్తెమ్మతల్లి జాతర సోమవారంతో ముగిసింది. ఈ జాతరకు విచిత్ర సంప్రదాయం ఉంది. మిగిలిన గ్రామ దేవతల జాతరలకు భిన్నంగా పగటిపూట జరుగుతుంది. అంతేకాకుండా ఈ జాతరలో భక్తులు విచిత్ర వేషధారణలతో మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా సామాన్యుడు నుంచి శ్రీమంతులు వరకూ మొక్కుకున్నది ఎవరైనా సరే తర తమ బేధం లేకుండా జోలి పట్టి భిక్షమెత్తుకునే విలక్షణ ఆనవాయితీ కొప్పవరం సత్తెమ్మతల్లి జాతరలో ప్రత్యేకం. దీనికనుగుణంగా సోమవారం ఉదయం నుంచి వందల సంఖ్యలో భక్తులు చిత్రవిచిత్ర వేషధారణలతో అందరినీ అలరిస్తూ, ఆనందపరుస్తూ భవతీ భిక్షాందేహి అంటూ గ్రామంలో బిచ్చమెత్తుకుని తద్వారా వచ్చిన మొత్తాన్ని అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరలో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ ఒక్కరూ ఒక్కో వేషధారణలో దర్శనమిచ్చారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే అన్నమాటను అక్షర సత్యంగా భావించిన భక్తులు సత్తెమ్మతల్లిపై భక్తివిశ్వాసంతో జాతరలో పాల్గొన్నారు.


లవకుశుల వేషధారణలతో బాలురు